

ఆస్పత్రిలో వైద్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్ పాత్రో

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

● మల్కాజిగిరి ప్రభుత్వాస్పత్రిని తనిఖీ చేసిన మేడ్చల్ కలెక్టర్

మల్కాజిగిరి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాస్పత్రులకు వివిధ సమస్యలపై వచ్చే రోగులకు వైద్యులు నిత్యం అందుబాటులో ఉంటూ వారికి మెరుగైన వైద్యసేవలందించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్‌పాత్రో వైద్యులకు సూచించారు. శుక్రవారం మల్కాజిగిరి జిల్లా ప్రభుత్వాస్పత్రిని కలెక్టర్ ఆకస్మింగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని అన్ని విభాగాలను కలియ తిరుగుతూ ఆయా విభాగాల్లో పనితీరును సమీక్షించారు. ప్రసవాలపై ఆయన ఆరాతీశారు. ప్రభుత్వాస్పత్రిలోనే ఎక్కువ ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని వైద్యులకు సూచించారు. ఆస్పత్రిలోని సదుపాయాలు, మలేరియా, డెంగీ వ్యాధులపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యశ్రీ గురించి వైద్యులను అడిగి వివరాలు తీసుకున్నారు. కార్యక్రమంలో డీఎం అండ్ హెచ్‌వో రఘునాధస్వామి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డీసీహెచ్ కోట్యానాయక్, సౌందర్యలత, మల్కాజిగిరి డీఎం అండ్‌హెచ్‌వో ఆనంద్, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ సునీత, సంగీత్ పాల్గొన్నారు.

పెంచిన పెన్షన్లను తక్షణమే విడుదల చేయాలి

● కలెక్టర్ కార్యాలయం ఎదుట దివ్యాంగుల ధర్నా

మల్కాజిగిరి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం పెంచిన పెన్షన్‌ను అమలు చేయడంలో జాప్యాన్ని నిరసిస్తూ దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. దివ్యాంగులకు రూ.6 వేలు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు రూ.4 వేలు పెంచుతామని చెప్పి అధికారంలోకి వచ్చి ఏడు నెలలు అవుతున్నా ఇంత వరకు పెన్షన్లు అందించక పోవడం దారుణమని వారన్నారు. ఏపీలో ప్రభుత్వం ఏర్పడి నెలకూడ గడువక ముందే అక్కడ పెంచిన పెన్షన్లను అమలు చేస్తున్నారని, తెలంగాణలో ఎందుకు అమలు కావడం లేదని వారు ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం పెంచిన పెన్షన్లను తక్షణమే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దివ్యాంగుల హక్కుల పోరాటసమితి జిల్లా అధ్యక్షుడు వినయ్, మంగమ్మ, గంగపుత్ర శ్రీను, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి: మాజీ ఎమ్మెల్యే

● పోచమ్మ ఆలయంలో శ్రీశైలం గౌడ్ పూజలు

పేట్‌బషీరాబాద్, జూలై 5(ఆంధ్రజ్యోతి): ఆలయాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. రంగారెడ్డినగర్ డివిజన్ విజయనగర్ కాలనీలోని పోచమ్మ ఆలయంలో శుక్రవారం నిర్వహించిన మండల పూజమహోత్సవానికి ఆయన హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు ప్రజల అందరిపై ఉండాలన్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో విజయనగర్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎండీ రియాజ్, ప్రధాన కార్యదర్శి మల్లం శ్రీనివాస్‌గౌడ్, శ్రీను, శ్రీధర్, నర్సింహాగౌడ్, సుధాకర్‌గౌడ్, ఎలిష్, మదన్‌గౌడ్, దేవేందర్‌రెడ్డి, శ్రీనివాస్, సతీష్ పాల్గొన్నారు.

కుమారి ఆంటీ ఫుడ్‌స్టాల్ వద్ద

బాలీవుడ్ నటుడు సోనుసూద్ సందడి



కుమారి ఆంటీతో సోనుసూద్

రాయదుర్గం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఐటీ కారిడార్‌లో బాలీవుడ్ హీరో సోనుసూద్ సందడి చేశారు. మీది మొత్తం వెయ్యి రూపాయలు.. రెండు లివర్లు ఎగస్ట్రా అనే డైలాగ్‌తో సోషల్ మీడియాలో స్టార్‌గా మారిన కుమారీ ఆంటీ ఫుడ్ కోర్టును శుక్రవారం సోనుసూద్ అనుకోకుండా సందర్శించారు. షూటింగ్ నిమిత్తం హైదరాబాద్‌కు వచ్చిన ఆయన మధ్యాహ్నం 12 గంటల సమయంలో గచ్చిబౌలి మార్గం వైపున వెళ్తూ ఫుడ్‌కోర్టు వద్దకు వచ్చాడు. ఆయన వచ్చే 10 నిమిషాల ముందు కుమారీ ఆంటీ కుటుంబసభ్యులకు వ్యక్తిగత సిబ్బంది సమాచారం ఇచ్చారు. ఆ సమయంలో కుమారీ ఆంటీ బంధువుల ఇంటికి ఆటోలో వెళ్తుండగా.. ఆమె పిల్లలు ఫోన్‌లో సమాచారమివ్వడంతో వేగంగా ఫుడ్‌కోర్టు వద్దకు వచ్చింది. 12 గంటల ప్రాంతంలో కారులో వచ్చిన సోనూసూద్‌ను చూసి కుమారీ ఆంటీ, ఆమె పిల్లలు తెగసంతోషపడ్డారు. వచ్చిరాగానే.. 'హలో.. హవ్ ఆర్ యూ కుమారీ ఆంటీ.. క్రైసాయే ఆప్.. సో నైస్ టూ సీ యూ' అంటూ ఆప్యాయంగా పలకరించారు. నౌవ్ అయామ్ విత్ కుమారి ఆంటీ అని చెప్పడంతో అక్కడున్న వారందరూ చప్పట్లు కొట్టారు. ఈ సందర్భంగా సోనూసూద్ మాట్లాడుతూ కుమారీ ఆంటీ ఈజ్ సెల్ఫ్ మేడ్ లేడీ అని, ఉమన్ ఎంపవర్‌మెంట్‌ను చూపిస్తోందని కొనియాడారు. దేశంలోని ప్రతి మహిళ ఆమెను స్ఫూర్తిగా తీసుకోవాలని, కష్టపడే తత్వానికి కుమారి ఆంటీ ఇస్ బెస్ట్ ఎగ్జాంపుల్ అన్నారు. అనంతరం ఈ రోజు ఫుడ్‌కోర్టులో ఏమి ఉన్నాయని.. అడిగితే.. వెజ్, నాన్‌వెజ్ ఉందని కుమారీ ఆంటీ చెప్పింది. వెజ్ రూ.80, నాన్ వెజ్ రూ.120 ఉందని అంటే.. నేను రూ. 80 రూపాయల కస్టమర్ (వెజ్ కస్టమర్)ను అని నవ్వుతూ చెప్పారు. నాకు ఎంత డిస్కౌంట్ ఇస్తావంటే.. ఫ్రీ ఇస్తానని చెప్పింది. నాకు కష్టమొచ్చినప్పుడు ఫోన్ చేసి అండగా నిలబడ్డారు. మీరు మా దగ్గరి రావడం చాలా సంతోషంగా ఉంది.. థ్యాంక్యూ అని కుమారీ ఆంటీ అనగా.. గ్లాడ్ బ్లెస్ యూ అంటూ షేక్‌హ్యాండ్ ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

ద్విచక్ర వాహనాలు చోరీ చేస్తున్న యువకుడి అరెస్ట్

పేట్‌బషీరాబాద్, జూలై 5(ఆంధ్రజ్యోతి): పార్కు చేసిన ద్విచక్ర వాహనాలను చోరీ చేస్తున్న యువకుడి పేట్‌బషీరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి నుంచి 7 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ విజయ్‌వర్ధన్ వివరాలను వెల్లడించారు. మెదక్ జిల్లా, ఘనపూర్ మండలం, రాజాపేట్ గ్రామానికి చెందిన బొళ్ల నవీన్(20)బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి కుత్బుల్లాపూర్, అంగడీ పేటలో నివాసముంటూ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. జులాయిగా తిరుగుతూ,జల్సాలకు అలవాటు పడిన అతడు డబ్బు కోసం పార్కు చేసిన వాహనాలను దొంగతనం చేస్తున్నాడు. ఇటీవల పలువురు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం సుచిత్రా ప్రాంతంలో పోలీసుల వాహనాలను తనిఖీలు చేస్తుండగా అనుమానాస్పందంగా కనిపించిన నవీన్ అదుపులోకి తీసుకుని విచారించారు. జగద్గిరిగుట్ట, సూరారం, పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో ఏడు వాహనాలను చోరీ చేసినట్టు అంగీకరించాడు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

జీడిమెట్ల, జూలై 5(ఆంధ్రజ్యోతి): ఉరేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. చెరుకుపల్లి కాలనీ రెడ్ నంబర్-2లోని ఓ ఇంట్లో ఐస్ క్రీం వ్యాపారి వీరారెడ్డి(35) అతడి స్నేహితుడు శివ అద్దెకు ఉంటున్నారు. ఓ ఇంట్లో నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న పోలీసులు తాళాలు పగులగొట్టి ఇంట్లోకి వెళ్లి చూడగా వీరారెడ్డి ఉరేసుకుని వేలాడుతూ కన్పించాడు. మృతదేహాన్ని కిందకు దించి గాంధీ ఆస్పత్రికి తరలించారు. అతడి స్నేహితుడు శివ ఊరుకి వెళ్లినట్టు సమాచారం. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని జీడిమెట్ల సీఐ జీ. మల్లేశ్ తెలిపారు.

ప్రైవేటు బస్సుల్లో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు

● మద్యం తాగి బస్సు నడుపుతున్న డ్రైవర్‌పై కేసు

హైదరాబాద్ సిటీ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసుల ప్రైవేటు బస్సులపై ప్రత్యేక డ్రెంకెన్ డ్రైవ్ నిర్వహించారు. మియాపూర్‌లో పలు ప్రైవేటు బస్సు డ్రైవర్లకు బ్రీత్ అనలైజర్‌తో పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్ డ్రైవర్ మద్యం తాగి ఉండటంతో అతడిపై కేసు నమోదు చేశారు. ఇటీవల కాలంలో పలు ప్రైవేటు ట్రావెల్ బస్సులు ప్రమాదాలకు గురికావడం, వాటి డ్రైవర్‌లు మద్యం మత్తులో ఉండటం గుర్తించిన పోలీసులు, తనిఖీలు చేశారు. ఇకపై నిరంతరం ప్రైవేటు ట్రావెల్ బస్సుల్లోనూ డ్రైవర్లను తనిఖీలు చేస్తామని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.



శేరిలింగంపల్లి పాపిరెడ్డికాలనీ గృహసముదాయాల వద్ద రోడ్డుపై పారుతున్న మురుగు



ఓల్డుబోయినపల్లి డివిజన్ బోయిన్ చెరువులో పేరుకు పోయిన గుర్రపు డెక్క, వ్యర్థాలు



రాంరెడ్డి నగర్‌లో మురికి కుంటగా మారిన రోడ్డు

బాబోయ్.. దోమలు



● ప్రబలుతున్న విషజ్వరాలు, అంటు వ్యాధులు
● బస్తీల్లో ఫాంగింగ్ చేయని శానిటేషన్ సిబ్బంది
● పట్టించుకోని అధికారులు.. ఇబ్బందుల్లో ప్రజలు

వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాల్సిలన అధికారులు సమీక్షలకే పరిమితం అవుతోన్నారు. పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన శానిటేషన్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా కుత్బుల్లాపూర్, శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి నియోజక వర్గాలలోని పలు ప్రాంతాల్లో దోమలు స్వైర విహారం చేస్తోన్నాయి. మురుగునీరు రోడ్లపై నిల్వవుండకుండా చర్యలు తీసుకోవాల్సిన జలమండలి అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోన్నారు. ఓపెన్ డ్రైనేజీ కాల్వలను, శుభ్రం చేయకుండా వదిలేయడంతో చెత్తకుప్పల్లో లార్వా ద్వారా దోమలు వృద్ధి చెందుతున్నాయి. వేమనకాలనీ, తారానగర్, రాయదుర్గం, గచ్చిబౌలి, నానక్‌రాంగూడ అల్లాపూర్ డివిజన్‌లోని అన్ని కాలనీల్లో దోమల బెడద తీవ్రంగా ఉంది. అల్లాపూర్ పరిధిలోని మైసమ్మ చెరువు, సున్నం చెరువు, కాముని చెరువులలో కాలుష్యం, గుర్రపుడెక్క కారణంగా పరిసర కాలనీల్లో దోమలు విజృంభిస్తున్నాయి. బస్తీల్లో ఎంటమాలజీ సిబ్బంది ఫాగింగ్‌ను తూతూ..మంత్రంగా చేస్తున్నారు. దోమల కారణంగా ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్నా అధికార యంత్రాంగం పట్టించుకోవడంలేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతోన్నాయి.

(కుత్బుల్లాపూర్, శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి జోన్‌బృందం)

● హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని అంబీర్ చెరువు, అలీతలాబ్ చెరువు, ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలో ఎల్లమ్మ చెరువులో గుర్రపు డెక్క పేరుకుపోయి దోమల బెడద అధికంగా ఉంది. అంబీర్ చెరువుకు 5 ఏళ్ల క్రితం రూ. 25 కోట్లతో మినీ ట్యాంక్‌బండ్‌గా అభివృద్ధి పరచేందుకు ప్రణాళికలు రూపొందించినా, ఆశించిన స్థాయిలో పనులు సాగలేదు. ఇప్పటికీ కనీసం 10 శాతం పనులు కూడా జరగలేదు. చెరువుల చుటుపక్కల కాలనీల నుంచి వచ్చే మురుగు చెరువులోకి చేరటంతో గుర్రపుడెక్క పేరుకుని దోమల ఆవాసంగా మారుతున్నాయి.

● కుత్బుల్లాపూర్ సుభాష్‌నగర్ రాంరెడ్డినగర్, రంగారెడ్డి నగర్ తదితర ప్రాంతాల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. రోజుల తరబడి చెత్తను తరలించక పోవడంతో, కురుస్తున్న వర్షానికి దుర్వాసన వెదజల్లుతూ. మురుగునీటిలో దోమలు విజృంభిస్తున్నాయి.

● బాలానగర్ డివిజన్ పరిధిలో కల్యాణ్‌నగర్, చరబండరాజు కాలనీ, వినాయక్‌నగర్‌లో దోమల బెడద ఎక్కువగా ఉంది. జీడిమెట్ల సుభాష్‌నగర్ నుంచి పారుతున్న నాలా కారణంగా దోమల బెడద విపరీతంగా ఉంది. బీహెచ్‌ఈయల్ ఆర్ అండ్ డీ, ఫూల్‌భాగ్ కాలనీ రైల్వే ట్రాక్ పక్కన మురుగు నీటీ నిల్వ కారణంగా ఫిరోజ్‌గూడాలో దోమల సమస్య ఉంది.

ఓల్డుబోయినపల్లి డివిజన్‌లో....

ఓల్డుబోయినపల్లి డివిజన్‌లోని బోయిన్ చెరువు కారణంగా చెరువు చుట్టూ ఉన్న బస్తీలైన అంజయ్య నగర్, మనోవికాస్‌నగర్, హస్మత్‌పేట్, హరిజనబస్తీ, లయన్ టౌన్ కాలనీ, సాయిసాగర్ ఎన్‌క్లేవ్‌లలో దోమల బెడద విపరీతంగా ఉంది. చెరువులో గుర్రపు డెక్కను తీయక పోవడం, స్థానికులు చెత్తాచెదారం వేయడం వలన దోమల సమస్య ఎక్కువగా ఉంది.

ఫతేనగర్ డివిజన్‌లో....

ఫతేనగర్ డివిజన్ శివశంకర్‌నగర్, శివాలయం రోడ్డు, దీనదయాల్‌నగర్ బస్తీలలో దోమ సమస్య ఉంది. శివశంకర్‌నగర్‌లో డ్రైనేజీలు లీక్ కావడం ఇందుకు కారణంగా స్థానికులు చెబుతున్నారు. శివాలయం రోడ్డులోని బస్తీ, దీనదయాల్‌నగర్ ఈ రెండు నాలాకు సమీపంలో ఉన్నందున దోమల సమస్య ఎక్కువగా ఉంది.

కూకట్‌పల్లిలో...

● కూకట్‌పల్లి ప్రాంతంలో దోమల బెడద తీవ్రతరమవుతోంది. కాలనీలు, బస్తీల్లో సాయంత్రం అయిందంటే దోమలు తేనెటీగల మాదిరిగా చుట్టుముడుతున్నాయి. హాయిగా ఆరుబయట కొద్దిసేపు కూర్చోలేని దుస్థితి నెలకొంది. ముఖ్యంగా రోడ్లపై వర్షపునీరు నిల్వ ఉండడం, డ్రైనేజీ నిర్వహణ సక్రమంగా చేపట్టకపోవడం, చెరువుల్లో గుర్రపు డెక్క పేరుకుపోయి ఉండడం, నాలాలు అపరిశుభ్రంగా ఉండడం వంటి కారణాలతో దోమల సమస్య ఉత్పన్నమవుతోంది. కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీకాలనీ, మూసాపేట, వివేకానందనగర్‌కాలనీ, బాలాజీనగర్ ప్రాంతాల్లోనూ దోమల సమస్యతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీకాలనీ, మూసాపేట, వివేకానందనగర్‌కాలనీ, బాలాజీనగర్ ప్రాంతాల్లో చిన్నపాటి వర్షానికే రహదారులు, రోడ్లపై వర్షపునీరు నిల్వ ఉండడంతో దోమలకు అవాసాలుగా మారుతున్నాయి. దోమల కారణంగా ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారు. ఇప్పటికే పలువురు విషజ్వరాలు, సీజనల్ వ్యాధులతో ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు.

కుత్బుల్లాపూర్, గాజులరామారం జంటసర్కిళ్ల పరిధిలోని పలు బస్తీలు, కాలనీల్లో ఫాగింగ్ 15 రోజులకొకసారి చేస్తోన్నారు. దాంతో దోమలు వ్యాప్తి చెంది, కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయని కాలనీల ప్రజలు ఆరోపిస్తున్నారు.



బాలానగర్ బస్తీల గుండా పారుతున్న ఓపెన్ నాలా

దోమల బెడదపై ప్రత్యేక ఫైల్

చెరువుల్లో పేరుకున్న గుర్రపుడెక్కను ఎప్పటికప్పుడు తొలగించి చెరువులు కలుషితం కాకుండా చూడాల్సిన అధికారులు, చూసీచూడనట్టు వ్యవహరించటంతో చెరువులు దుర్వాసన వెదజల్లుతున్నాయి. చెరువు సమీపంలో నుంచి రాకపోకలు సాగించాలన్నా ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. గుర్రపుడెక్క ఇబ్బడి ముబ్బడిగా పెరగటంతో సాయంత్రం ఐదు దాటితే బయట నిలువలేని దుర్భర పరిస్థితి. కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలో అంబీర్‌చెరువు, ఎల్లమ్మ చెరువు, భీమునికుంట, పరికి చెరువుల్లో గుర్రపుడెక్కతో పరుచుకుపోయింది. జీహెచ్‌ఎంసీ సిబ్బంది గుర్రపుడెక్కను తొలగించి అక్కడే కట్టపై వేయటంతో తిరిగి చెరువులోకి చేరుతుంది. ఏళ్లకుఏళ్లు గుర్రపు డెక్క తొలగింపులో అధికారులు వహిస్తున్న నిర్లక్ష్యంతో సమీప కాలనీ వాసులు దోమల కారణంగా ఆస్పత్రుల పాలవుతున్నారు.

డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడమూ

వర్షపునీరు నిల్వ సమస్యతోపాటు డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడమూ దోమల సమస్యకు కారణమవుతోంది. కాలనీల్లో డ్రైనేజీలు పొంగిపొర్లడం, మ్యాన్‌హోల్స్ నుంచి తొలగించిన వ్యర్థాలను సకాలంలో తొలగించకపోవడంతో దోమల వ్యాప్తి పెరుగుతోంది.

గుర్రపు డెక్కతో....

దోమల వృద్ధికి చెరువులు అడ్డాగా మారాయి. కూకట్‌పల్లిలోని ముళ్లకత్వ చెరువు, కాముని చెరువు, మైసమ్మచెరువు, ఐడీఎల్‌చెరువుల్లో గుర్రపు డెక్క పేరుకుపోయింది దీంతో పరిసర కాలనీవాసులు దోమలతో అవస్థలు ఎదుర్కొంటున్నారు. చెరువుల్లో గుర్రపు డెక్క తొలగించాలంటూ ప్రజాప్రతినిధులు, అధికారులను వేడుకొంటున్నారు. దోమల సమస్య నివారణకు కొన్ని గేటెడ్‌కమ్యూనిటీల నిర్వాహకులు వారి కాలనీల్లో స్వంతంగా ఫాగింగ్ చేసుకోవడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వంటి పనులు చేపడుతున్నారు. చెరువుల్లో గుర్రపుడెక్క తొలగిస్తే సమస్య కొంతమేర తగ్గుముఖం పడుతుందని కాలనీవాసులు పేర్కొంటున్నారు.

దోమల బెడదను నివారించాలి



దోమల బెడద విపరీతంగా ఉంది. రాత్రియితే ఇళ్లలోకి చేరి కంటిమీద కునుకు లేకులేకుండా చేస్తున్నాయి. నెలలు తరబడి రంగారెడ్డినగర్ డివిజన్‌లో ఫాంగింగ్ చేయడం లేదు. మున్సిపల్ అధికారులు ఫాగింగ్ చేపట్టాలి. దోమలు వృద్ధి చెందకుండా చర్యలు తీసుకోవాలి.

- సుధాకర్, స్థానికుడు

చీకటి పడితే ఇంట్లో ఉండలేకపోతున్నాం



బోయిన్ చెరువులో గుర్రపు డెక్క కారణంగా దోమల బెడద ఎక్కువగా ఉంది. చీకటి పడితే ఇంట్లో ఉండలేక పోతున్నాం. దోమలు ఇళ్లలోకి చేరి స్వైరవిహారం చేస్తున్నాయి. సరైన ఫాగింగ్ లేదు, చెరవులో గుర్రపు డెక్కను తొలగించడం లేదు.

- రెబ్బల రాజు, హరిజనబస్తీ, ఓల్డుబోయినపల్లి

అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి



కేపీహెచ్‌బీకాలనీ ఐదోఫేజ్‌కు ఆనుకొని జంగిల్ ఉండడంతో దోమలతో అల్లాడిపోతున్నాం. డెంగీ, చికెన్‌గున్యా వంటి వ్యాధులు ప్రబలుతున్నాయి. అధికారులు ప్రత్యేక దృష్టి సారించి దోమల నివారణకు చర్యలు చేపట్టాలి. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా ఆరోగ్యశాఖ అప్రమత్తం కావాల్సిన అవసరముంది. దోమల నివారణపై అవగాహన కల్పించారు.

- అత్తోట శివరామకుమార్, కేపీహెచ్‌బీ ఐదోఫేజ్

పారిశుధ్య నిర్వహణపై దృష్టి సారించాలి



దోమల నివారణకు పరిసరాల పరిశుభ్రతపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి. చెత్త, వ్యర్థాలు తొలగించిన ప్రాంతంలో బ్లీచింగ్ చల్లాలి. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా కఠిన చర్యలు అమలు పర్చాలి. ఎల్‌ఐజీ, ఎంఐజీ గృహసముదాయాల్లో నిరంతరం మురుగు ప్రవహిస్తూ ఉంది. జలమండలి అధికారులు సకాలంలో డ్రైనేజీ సమస్యకు పరిష్కారం చూపాలి. ముఖ్యంగా దోమల నివారణకు ప్రజల్లో అవగాహన కల్పించాలి.

- జాలారి శివ నారాయణరావు, కేపీహెచ్‌బీ మూడోఫేజ్

గ్రామాల్లోని ప్రభుత్వ భూములను కాపాడాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న శ్రీనివాస్

నిజాంపేట్, జూలై 5(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని ప్రభుత్వ భూములను కాపాడాలని సీపీఐ మండల కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్ కోరారు.బాచుపల్లి మండల పరిధిలోని నిజాంపేట్, బాచుపల్లి గ్రామాల్లోని 82, 93, 95, 186, 191, 334 సర్వే నెంబర్లలో అక్రమంగా నిర్మాణాలు కొనసాగుతున్నాయని, నిర్మాణదారులపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం బాచుపల్లి తహసీల్దార్ పూల్‌సింగ్ చహ్వాన్‌కు ఆయన వినతిపత్రం అందజేశారు. ఎన్నికలకు ముందు జీవో నెంబరు 59 ప్రకారం ఎలాంటి అనుమతులు లేకండా ఇళ్ల నిర్మాణం కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, దానిని అడ్డుపెట్టుకుని కొందరు ప్రభుత్వ స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలు చేస్తున్నారని తహసీల్దార్‌కు వివరించారు. 82,93,95 సర్వే నెంబర్లలో జరుగుతున్న కబ్జాలపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. గ్రీన్ ఫీల్డ్‌కు వెళ్లే దారిలో కొంతమంది కబ్జాదారులు తప్పుడు పత్రాలతో అక్రమ నిర్మాణాలు చేపట్టారని, సర్వే నెంబరు 344లో చెరువుశిఖం భూమిని కబ్జా చేసి అక్రమంగా బహుళ అంతస్తులు, అపార్టుమెంట్లు నిర్మిస్తున్నారని, వాటికి సంబంధించిన పత్రాలను పరిశీలించి వాస్తవాలను వెలుగులోకి తీసుకు రావాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సీపీఎం నాయకులు యాదయ్య, కె. మల్లయ్య, సీహెచ్ యాదగిరి తదితరలు ఉన్నారు.

'విజయలక్ష్మి కన్‌స్ట్రక్షన్స్‌పై చర్యలు తీసుకోవాలి'

నిజాంపేట్,జూలై 5(ఆంధ్రజ్యోతి): మల్లంపేట్ గ్రామపంచాయతీ పరిధిలో విజయలక్ష్మి కన్‌స్ట్రక్షన్స్ భూఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నిజాంపేట్ కార్పొరేషన్ అధ్యక్షుడు ఆకుల సతీష్ కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆర్డీవో శ్యాంప్రకాశ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. 170/3 ఇతర సర్వేనెంబర్‌లలో 12.5 ఎకరాల భూమిలో తప్పుడు అనుమతులు తీసుకుని విల్లాలు నిర్మిస్తున్నారన్నారు. కత్వాచెరువు ఎఫ్‌టీఎల్‌లో, బఫర్‌జోన్‌లు 8 విల్లాలు నిర్మిస్తున్నారని వినతిపత్రంలో ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట అరుణ్‌రావు, శ్రీనివాస్‌గౌడ్ ఉన్నారు.

సిలిండర్‌కు రెగ్యులేటర్ పెడుతుండగా గ్యాస్ లీక్

● మంటలంటుకుని తండ్రి, కుమారుడికి గాయాలు

రాయదుర్గం,జూలై 5 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు గ్యాస్ సిలిండర్ పేలిన ఘటనలో తండ్రి, కుమారుడు గాయపడ్డారు. రాయదుర్గం ఇన్‌స్పెక్టర్ వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం... విద్యుత్‌శాఖలో పనిచేస్తున్న సత్తయ్య(55) అతని కుమారుడు నర్సింగ్‌రావు(27) శుక్రవారం ఉదయం ఇంటిలో సిలెండర్‌కు కుమారుడు నర్సింగ్‌రావు సిలిండర్‌కు రెగ్యులెటర్ పెడుతుండగా గ్యాస్‌లీక్ అయింది. పక్కనే తండి సత్తయ్య పూజ గదిలో దీపాలు వెలిస్తున్నాడు. అప్పటికే గ్యాస్ లీకై కావడంతో మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో తండ్రి, కుమారుడికి మంటలు అంటుకోగా ఒకటో అంతస్తులో ఉన్న కిచెన్ గది నుంచి కుమారుడు బయటకు దూకేసేశాడు. పూజ చేస్తున్న సత్తయ్యకు మంటలు అంటుకుని గాయాలయ్యాయి. గమనించిన చుట్టుపక్కల ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చి మంటలు ఆర్పివేశారు. గాయపడిన తండ్రి కుమారుడిని నానక్‌రాంగూడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. వారిని పరిశీలించిన వైద్యులు ఓల్డ్‌సిటీలోని మరో ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. సత్తయ్య 80శాతం గాయాలతో పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పినట్లు సమాచారం. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ వెంకన్న తెలిపారు.

సింగరేణి సంస్థకే


బొగ్గుగనుల బ్లాకులను ఇవ్వాలి: సీపీఎం

బాలానగర్, జూలై 5(ఆంధ్రజ్యోతి): సింగరేణి బొగ్గు గనుల బ్లాకులను వేలం వేసి ప్రైవేట్‌పరం చేయాలని చూస్తే ఊరోకోబోమని సీపీఎం నాయకులు హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముట్టడికి సీపీఎం పార్టీ ఇచ్చిన పిలుపుతో బాలానగర్ మండల కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్ ఆధ్వర్యంలో మేడ్చల్ కలెక్టరేట్‌కు మహిళలు కార్యకర్తలు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ సింగరేణి సంస్థకే బొగ్గుగనుల బ్లాకులను ఇవ్వాలని అన్నారు. గనులను ప్రైవేటు పరం చేయాలని చూస్తే కేంద్రగనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యురాలు విజయలక్ష్మీ, రజియా తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులోకి 'గ్రోయి ఎక్స్' అప్లికేషన్

హైదరాబాద్ సిటీ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కృత్రిమ మేధ వినియోగించి పంటలకు వచ్చే తెగులు, చీడపీడలతోపాటు వచ్చే వ్యాధులను కచ్చితంగా గుర్తించడం, వాతావరణ వివరాలను అందించే 'గ్రోయి ఎక్స్' అప్లికేషన్‌ను గ్రోవిరో సంస్థ అందుబాటులోకి తెచ్చింది. గ్రోవిరో సంస్థ ఎండీ దేవేంద్ర దాసరి అప్లికేషన్‌ను ప్రారంభించారు. అప్లికేషన్ సాయంతో వ్యవసాయం, వాతావరణ మార్పుల సవాళ్లను సమర్థవంతంగా అంచనా వేయగలమని చెప్పారు. ఉపగ్రహం నుంచి అందిన సమాచారంతో పంటలకు నీటి అవసరాన్ని 50 శాతం తగ్గించవచ్చన్నారు. కార్యక్రమంలో సంస్థ మార్కెటింగ్ మేనేజర్ తరుణ్ పాంటాతోపాటు సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

స్టార్ కార్పొరేట్ క్లినిక్ ప్రారంభం



స్టార్ కార్పొరేట్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న నిర్వాహకులు

హైదరాబాద్ సిటీ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ ఉద్యోగులకు వైద్య సేవలు అందించడానికి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ లోని స్టార్ ఆస్పత్రిలో వేవ్‌రాక్ సెజ్‌తో భాగస్వామ్యంగా కలిసి వేవ్ రాక్ ఫెసిలిటీలో స్టార్ కార్పొరేట్ క్లినిక్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఆస్పత్రి నిర్వాహకులు తెలిపారు. స్టార్ ట్రామా యాక్సిడెంట్ రెస్పాన్స్ నెట్‌వర్క్ మద్దతుతో సమగ్ర వైద్య సేవలను అందిస్తుందని, అన్ని రకాల అత్యవసర పరిస్థితులకు తక్షణ సహాయాన్ని పొందచ్చునని తెలిపారు. అత్యవసర సేవల కోసం బాధితులు 9071104108 నంబర్‌కు ఫోన్ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో టీఎస్ఐ బిజినెస్ పార్క్స్ (హైదరాబాద్) ప్రైవేట్ లిమిటెడ్ సీనియర్ డైరెక్టర్ ప్రాపర్టీ మేనేజిమెంట్ హెడ్ కల్నల్ సంజయ్ భరద్వాజ్, స్టార్ ఆస్పత్రి గ్రూప్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ రాహుల్ మెడక్కర్, వాకా భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.



షాపింగ్‌మాల్‌లో పనిచేస్తున్న సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న సీఐ నాగరాజు

ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

పేట్‌బషీరాబాద్, జూలై 5(ఆంధ్రజ్యోతి): వాహనదారులు నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామనిఅల్వాల్ ట్రాఫిక్ సీఐ ఏ. నాగరాజు హెచ్చరించారు. శుక్రవారం స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో నెంబర్ ప్లేట్ లేకుండా తిరుగుతున్న వాహనదారులను, రాంగ్ రూట్‌లో వస్తున్న వాహనదారులను ఆపి తనిఖీలు చేశారు. వారిని పోలీస్ స్టేషన్‌కు తీసుకు వచ్చి కౌన్సెలింగ్ ఇచ్చారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెంట్‌ను తప్పని సరిగా ధరించాలని, వాహనానికి సంబంధించిన పత్రాలను వెంట ఉంచుకోవాలని ఈ సందర్భంగా సీఐ వారికి సూచించారు. ఇప్పటి వరకు 21 మందిపై కేసులు నమోదు చేశామన్నా రు. అనంతరం సుచిత్రాలోని సౌత్‌ఇండియా షాపింగ్‌మాల్, చెన్నై సిల్క్స్‌లో పనిచేస్తున్న సిబ్బందికి ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు.

వీధి రౌడీలపై చర్యలు తీసుకోవాలి

పోలీసులకు సుమిత్రానగర్ కాలనీ వాసుల విజ్ఞప్తి

పేట్‌బషీరాబాద్, జూలై 5(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి, సుమిత్రానగర్ కాలనీలో కొందరు వీధిరౌడీల ఆగడాలతో ఇబ్బందులు పడుతున్నామని, వీధి రౌడీల నుంచి రక్షించాలని ఆ ప్రాంత ప్రజలు పోలీసులకు విజ్ఞప్తి చేస్తున్నారు. కాలనీలో ఉంటున్న నలుగురు వ్యక్తులు (రౌడీలు చలామణి అవుతూ) పగలు, రాత్రి వేళల్లో వీధుల్లో తిరుగుతూ, ఇళ్లల్లోకి వెళ్లి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు.ఇళ్ల ముందు పార్కు చేసిన ద్విచక్రవాహనాలను ధ్వంసం చేస్తున్నారు. వీధుల్లోకి వచ్చి మహిళల మెడల్లోని బంగారు గొలుసులు తెంచుకుని, సెల్‌ఫోన్లు తీసుకుని పారిపోతున్నారు. పోలీసులు నిఘా పెట్టి వీధి రౌడీలను అదుపులోకి తీసుకుని కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

సేవా కార్యక్రమాల్లో యువత భాగస్వాములు కావాలి

పేట్‌బషీరాబాద్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): సేవా కార్యక్రమాల్లో యువత భాగస్వాములు కావాలని బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్‌సింహారెడ్డి అన్నారు. అమావాస్య సందర్భంగా కుత్బుల్లాపూర్ జీడిమెట్ల గ్రామంలోని శ్రీవాసవీ సేవాదళ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. కార్యక్ర మంలో శ్రీవాసవి సేవాదళ్ సభ్యులు వెంకటేశం, భిక్షపతి, నాగరాజు, రమేష్, శివకుమార్, శ్రీనివాస్, యూత్ సభ్యులు పాల్గొన్నారు.